క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు సురక్షితం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఆరోగ్య సిబ్బంది

యల్లనూరు: ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు సురక్షితమని వైద్యురాలు సాయినాగశ్రీ తెలిపారు. మంగళవారం తిమ్మంపల్లి పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద 48 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగసూత్రలు తెలియజేశారు. కొడవండ్లపల్లి తిరుపతినాయుడు గర్భిణులకు భోజన వసతి ఏర్పాటు చేశాడు. ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ, పీహెచ్‌ఎన్ జగదాంబిక, సూపర్‌వైజర్ రాము పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నార్పల: మండల వ్యాప్తంగా మొక్కజొన్న పంట సాగు చేసిన ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రబీ కింద సాగు చేసిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ.1,962 మద్దతు ధర ప్రకటించిందని, పంటను ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న రైతులందరూ ఈ నెల 12లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ పథకాలు



32వ వార్డులో పర్యటిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి: రాష్ట్ర ప్రభుత్వం కులమత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32 వార్డు, పీర్లమాన్యంలో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం పథకాలకు సంబంధించిన మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. తాడిపత్రిని అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో మరెన్నో అభివృద్ధి పనులు తాడిపత్రిలో చేపడతారన్నారు. వార్డు నాయకులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

గుంతకల్లు: కొంగనపల్లిలో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గ్రామానికి చెందిన రామన్న(50)కు భార్య భూలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. తనకున్న రెండెకరాల్లో పంటలు సాగు చేసేవాడు. పంటలు సరిగా పండకపోవడంతో దాదాపు రూ.9 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తర్వాత అనంతపురం తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



ఆటలు ఆడుతున్న చిన్నారులు

పెద్దవడుగూరు : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పాముల పటం, క్యారమ్స్, చెస్ లాంటి ఆటలు ఆడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణస్వామి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు: యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని శ్రీ శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ బి.గోపాలు సూచించారు. ఇటీవల బెంగళూరులోని న్యూ ఆరిజన్ ఇంజినీరింగ్ కళాశాలలో టీసీఎస్ నిర్వహించిన కెరీర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నాన్ ఐటీ విభాగం కింద కళాశాల ఫైనలియర్ విద్యార్థులు శ్వేతరాణి, జంబుల రమణ, పూజిత, ఏనుగుల లావణ్య ఉద్యోగాలు పొందారు. మంగళవారం వారిని కళాశాల యాజమాన్యం అభినందించింది. కెరీర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కృష్ణయ్య, అధ్యాపకుడు ఖాజావలి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గుర్రబ్బాడు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే వైవీఆర్ గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ బుక్‌లెట్‌లోని వివరాల మేరకు పథకాలు వర్తించాయా లేదా అని లబ్ధిదారులను ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరు..లోటుపాట్లతో పాటు సమస్యలు తెలుకుని పరిష్కరించేందకు మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే ప్రజలతో చెప్పారు. గృహాలు మంజూరు చేయాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ ఇవ్వడం లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విభాగాల అధికారులకు, సచివాల ఉద్యోగులకు ప్రాధ్యనత్య క్రమంలో వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన దిశగా ముందుకు సాగుతున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అవినీతి లేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ చేస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ బి.మాధవీ, వైస్ ఎంపీపీ ప్రభావతి, ఎంపీటీసీ హనుమంతు, కో ఆప్షన్ సభ్యుడు సిపాయిబాషా, మండల కన్వీనర్ బి.మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయులు, ఆది, దశరథ, మల్లప్ప, నరసింహులు, ప్రతాప్, కసాపురం సోమిరెడ్డి, గోవిందునాయక్, జయరామిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, మురళీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.





సంక్షేమ లబ్ధిని చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం అరకటివేములలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా మన రాష్ట్రంలోనే నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జననన్న దేశానికే మార్గదర్శకమయ్యారన్నారు. పల్లె ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫారసు లేకుండా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని, నాడు–నేడు కార్యక్రమంతో పాటు విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకొచ్చిన మార్పులే ఇందుకు కారణమన్నారు. కార్పొరేట్ స్కూల్స్ కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులను సాధించాయన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, సర్పంచులు యేసమ్మ, మహేశ్వరెడ్డి, రామాంజులరెడ్డి, నాయకులు కంచెం శ్రీనివాసులరెడ్డి, హరినాథరెడ్డి, కేశవనాయుడు, కందికాపుల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ చేరుస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మండలంలోని తరలారి చెరువు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సమీపంలో వెలసిన హాజీవలి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చేరుకుని ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. పెద్ద ఎత్తున మహిళలు ఆయన వెంట నడిచారు. గ్రామస్తులతో సమస్యలపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో అలసత్వం వహించవద్దని అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వంలో అవినీతికి అవకాశం లేకుండా ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారులకే అందజేస్తున్నారన్నారు. కులమత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, తహసీల్దార్ మునివేలు, ఈఓఆర్డీ జిలాన్ బాషా, ఎంఈఓ నాగరాజు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ సిబ్బంది, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తలారి చెరువులో మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పుట్లూరు: మండలంలోని అరకటివేములలో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ అధికారులు హాజరు కావాలని కోరారు.

గుంతకల్లు: నాగసముద్రంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో కోరాయి.

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు

బుక్కరాయసముద్రం: ఉపాధి హామీ సిబ్బంది విధి నిర్వహణలో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ప్రవర్తిస్తే సహించేది లేదని ఎంపీపీ సునీత హెచ్చరించారు. మంగళవారం ఎంపీపీ చాంబర్‌లో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎక్కడెక్కడ ఏఏ పనులు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ కూలీలకు బిల్లులు సక్రమంగా చెల్లించాలన్నారు. ఈఓఆర్‌డీ దామోదరమ్మ, ఏపీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుట్లూరు: కడవకల్లులో మంగళవారం మరియమ్మ అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. మరియమ్మ ఇంటి పక్కనే ఉన్న వారితో స్థలం విషయంలో ఘర్షణ పడింది. తీవ్ర మనస్థాపానికి గురై క్రిమి సంహారక మందు తాగింది. స్థానికులు ఆమెను అనంతపురం తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడిపత్రి: ఆటోనగర్ సమీపంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. యల్లనూరు నుంచి రేషన్ బియ్యాన్ని బొలెరోలో కర్ణాటకకు సరఫరా చేస్తున్న ఇద్దరి అదుపులోకి తీసుకున్నారు. బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు.

వేరుశనగ విత్తనం కోసం నమోదు చేసుకోండి

శింగనమల: వేరుశనగ విత్తనం కోసం ఈనెల 15 నుంచి ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని ఏఓ చిన్నమ్మ రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి ఆర్బీకేలో వేరుశనగ విత్తనం నిల్వకు గోదాములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బ్యాగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కే6 ఒక బ్యాగు పూర్తి ధర రూ.9,300 కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.3,720 పోను రూ.5,580 చెల్లించాలన్నారు. విత్తన నాణ్యతను వ్యవసాయ సలహా కమిటీ, సర్పంచ్ ఆధ్వర్యంలో పరిశీలిస్తారన్నారు. ఏఈఓ అక్కమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



గార్లదిన్నె: మాట్లాడుతున్న ఏఓ సోమశేఖర్

మండలానికి 2,500 క్వింటాళ్ల వేరుశనగ

గార్లదిన్నె: ప్రభుత్వం మండలానికి 2,500 క్వింటాళ్ల కే–6 రకం వేరుశనగ కేటాయించినట్లు ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌లో సబ్సిడీపై రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు. పూర్తి ధర క్వింటాల్ 9,300, కేజీ రూ.93కాగా సబ్సిడీతో రూ.3,720, కిలో రూ.37.20 ధర నిర్ణయించారన్నారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 3 బస్తాలు, ఒక్కో బస్తాకు రూ.1,674 చెల్లించాలన్నారు. ఈనెల రెండో వారంలో ఆర్బీకేల్లో రైతుల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్

కడప అర్బన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.16 లక్షల విలువైన 21 బైకులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల సుందరయ్య నగర్‌కు చెందిన మల్లెపోగు ప్రసాద్, మైలవరం మండలం బుబుసానిపల్లెకి చెందిన గువ్వల పుల్లారెడ్డి, ఎర్రగుంట్ల అంబేడ్కర్ నగర్‌కు చెందిన దండు నరసింహులు, ప్రకాష్‌నగర్‌కు చెందిన పిక్కిలి చరణ్‌కుమార్... వైఎస్సార్ జిల్లాతోపాటు, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాలు, తెలంగాణ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఆరు నెలల వ్యవధిలోనే 25 బైక్‌లు దొంగలించారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లితో పాటు సి.కొత్తపల్లెలో 2, అనంతపురం 4వ పట్టణ పోలీస్‌స్టేషన్, గుంతకల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 బైక్‌లు దొంగలించినట్లు విచారణలో తేలింది. నిందితులను ఈ నెల 8న ఎర్రగుంట్ల టౌన్ సమీపంలో అదుపులోకి తీసుకుని 21 బైకులు రికవరీ చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి పేర్కొన్నారు. మంగళవారం రేకులకుంట గ్రామంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. క్లినిక్‌లో వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. 104 వాహనంలో ఉన్న మందులను పరిశీలించారు. 104 వాహనం ద్వారా ప్రజలకు అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. రోజూ వస్తున్న టెలీ కన్సల్టేషన్ కాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కొర్రపాడు డాక్టర్ వినోద్‌కుమార్, సీహెచ్‌ఓ రామకృష్ణ, ఏఎన్‌ఎం నాగరత్నమ్మ, ఎంపీహెచ్‌ఏ వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు

యాడికి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు..మండల కేంద్రంలోని 12వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త మల్లేశ్వరీ లైబ్రరీ సమీపంలో ఉన్న తన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టింది. మంగళవారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఓ గదిలో ఉన్న విద్యుత్ వైరును మల్లేశ్వరీ భర్త రాజేశ్‌కుమార్ తాకటంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొత్త ఇంటిలోపలికి పోయిన కొడుకు రాజేశ్‌కుమార్ ఎంత సేపటికీ రాకపోవడంతో అతడి తల్లి గట్టిగా కేకలు వేసింది. దీంతో ఇరుగుపొరుగు వారు లోపలికి ప్రవేశించగా రాజేష్‌కుమార్ విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే అతడిని యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

చోరీ సొత్తు రికవరీ

తాడిపత్రి అర్బన్: స్థానిక సంజీవ నగర్‌లోని ఆర్ శ్రీనివాసులు ఇంటిలో చోరీ జరిగిన ఘటనకు సంబంధించిన సొమ్మును నిందితుల నుంచి రికవరీ చేసినట్లు పట్టణ సీఐ ఆనందరావు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఈ ఏడాది మార్చి 28 రాత్రి సంజీవ నగర్‌లోని ఆర్ శ్రీనివాసుల ఇంటిలో చోరీ జరిగింది. అప్పట్లో బాధితుని ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా తాడిపత్రికి చెందిన ఆర్.మహేష్ రాజు, ధర్మవరానికి చెందిన షాకీలుల్లాను విచారించారు. నిందితుల సమాచారం మేరకు వారి నుంచి 60 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. చోరీ కేసును ఛేదించిన ఎస్‌ఐ ధరణీబాబు, ఏఎస్‌ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు భాస్కర్, శ్రీను నాయక్, రిజ్వాన్ వలీని ఈసందర్భంగా సీఐ అభినందించారు.



అరెస్టు చేసిన నిందితులతో సీఐ, ఎస్‌ఐలు

ఖాళీ స్థలాలకు టెండర్లు

గుత్తి: పామిడి, పెద్దవడుగూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం రమేష్, డీఈ సురేంద్ర అన్నారు. గుత్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో డీఎం కార్యాలయంలో మంగళవారం ఔత్సాహిక వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23లోపు టెండర్లు దాఖలు చేయాలన్నారు. టెండర్ ఫారాలు కడపలోని ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలన్నారు. ఇన్‌చార్జ్ డీఎం శంకర్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని హోరబ్ చర్చి ఏరియాలో జకరయ్య– గోవర్ధన్ వర్గాల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. గోవర్ధన్, మద్దయ్యతో పాటు మరో ఇద్దరు రాజన్న, జక్కరయ్య, శాంతిపై కర్రలు, కత్తితో దాడి చేసి గాయపరిచారు. శాంతిని గోవర్ధన్ కామెంట్ చేశాడనే కారణంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



మృతుడు రహంతుల్లా

యల్లనూరు: ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెన్నపూసపల్లికి చెందిన రహంతుల్లా (52)కు భార్య గౌసియా, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రాత్రి తాను నివాసముంటున్న మిద్దెపైకి చేరుకున్న రహంతుల్లా.. పత్తి చెట్టు కొమ్మలు తొలగిస్తూ అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు పులివెందులలోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

గుత్తి: పట్టణంలోని పలు దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు నేతృత్వంలో మున్సిపల్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ విక్రయించే దుకాణదారులపై జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. అనంతరం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఏఈ శరత్ చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, మున్సిపల్ మేనేజర్ ఇమామ్ ఉన్నారు.

ఉత్సాహంగా తప్పెట పోటీలు

నార్పల: స్థానిక అంబేడ్కర్ కాలనీలో మంగళవారం తప్పెట పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. తప్పెట శబ్దం వినిపించకపోతే వినోదం, సమాచారం ఆగిపోతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచు మన్నీల సుప్రియ, ఉప సర్పంచు గువ్వల శ్రీరాములు, ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూషణ్‌రెడ్డి, శివయ్య, గోపాల్, నిర్వాహకులు రాము, నల్లప్ప, బయ్యన్న పాల్గొన్నారు.

లారీలు ఢీ – వ్యక్తి దుర్మరణం

ముద్దనూరు: లారీలు పరస్పరం ఢీకొన్న ఘటనలో గుంతకల్లు నివాసి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమవారం రాత్రి 11 గంటలకు ముద్దనూరు మండలం యామవరం గ్రామ సమీపంలో తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరుకు వస్తున్న లారీని యర్రగుంట్ల వైపు నుంచి ప్రయాణిస్తున్న లారీ ఢీకొంది. ఘటనలో తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ గుంతకల్లుకు చెందిన రాగుల రంగస్వామి(64)తో పాటు మరో లారీ డ్రైవర్ వెంకటరెడ్డి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం రంగస్వామి మృతిచెందాడు. ఘటనపై ముద్దనూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: పట్టణంలోని ప్రజలకు త్వరలోనే టిడ్కో ఇళ్లను అప్పగిస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్డీటీ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ లే అవుట్ వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ ఏఈ యుగంధర్‌తో మాట్లాడారు. టిడ్కో ఇళ్ల మొదటి దశలో భాగంగా ఎన్‌సీసీ లిమిటెడ్ చెందిన కాంట్రాక్టర్లు 300, 365, 430 చదరపు గజాల విస్తీర్ణంలో మొత్తం 25 బ్లాకుల్లో 2,304 ఇళ్లను 80 శాతం మేర పనులు పూర్తి చేశారని ఏఈ వివరించారు. రెండో దశలో భాగంగా ఎన్‌జేఆర్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్లు 300 చదరపు గజాల విస్తీర్ణంలో 1,776 ఇళ్ల నిర్మాణ పనులను దాదాపు 75 శాతం మేర పూర్తి చేశారన్నారు. దీంతో సంతృప్తి చెందని ఎమ్మెల్యే రెండు నెలల్లో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఫినిషింగ్ వర్క్‌లు మినహా అన్నీ పూర్తయ్యాయని త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని వారు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అనంతరం జగనన్న కాలనీలో ప్రభుత్వం ద్వారా నిర్మిస్తున్న వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కట్టడాలకు క్యూరింగ్ బాగా చేయాలని, పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని సైట్ ఇన్‌చార్జ్ సురేష్‌ను ఆదేశించారు. టిడ్కో ఇళ్లకు వెళ్లే, అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, నీటి సరఫరా తదితర వంటి పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.



టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలన

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా బండిశిల తిరునాల మరుబానం

పామిడి: రామరాజుపల్లిలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో బండిశిల మరుబానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని చిలకమ్మ మాను వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలను ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో విజేతలకు వరుసగా రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున నిర్వాహకులు అందజేశారు. మిగతా 5 గాన్ల వృషభరాజ రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రాత్రికి గ్రామదేవతలైన సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయం వద్ద 2 వేల మందికి అన్నదానం చేశారు. సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి, కంబగిరిరెడ్డి, దేవేంద్రరెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల: శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ల పోస్టులకు ఈ నెల12లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఉమాశంకరమ్మ తెలిపారు. నార్పల మండలం నడిమిపల్లి మిని అంగన్‌వాడీ వర్కర్(ఎస్టీ), నార్పలలోని తిక్కస్వామి వీధి–1 సెంటర్ హెల్పర్(బీసీ–సీ), తిక్కస్వామి–2 సెంటర్ హెల్పర్(ఓహెచ్), జంగంరెడ్డిపల్లి సెంటర్ హెల్పర్(వీహెచ్), శింగనమల మండలం ఉల్లికంటిపల్లి సెంటర్ హెల్పర్(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణతులై జూలై 1, 2022 నాటికి 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో 21 ఏళ్లు నిండినవారు లేకుంటే 18 ఏళ్ల నుంచి అర్హులన్నారు. అభ్యర్థులు వివాహితులై, అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గ్రామంలో స్థానికులై ఉండాలన్నారు. కుల, నివాస, పుట్టిన తేదీ, పదో తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డు జిరాక్స్, వికలాంగత్వం పత్రాలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలన్నారు. పదవతరగతి ఓపెన్ స్కూల్ ద్వారా పాసై ఉంటే తప్పనిసరిగా టీసీ, స్టడీ సర్టిఫికెట్లు జతపరచాలన్నారు. సీడీపీఓ నిర్వహించే తెలుగు డిక్టేషన్ పాసు కావాలన్నారు.